క్లుప్తంగా

ధ్యానంపై అవగాహన



కొల్లాపూర్‌ రూరల్‌: మండల పరిధిలోని అంకిరావుపల్లిలో పిరమిడ్‌ స్పిరిచ్యువల్‌ సొసైటీ ఆధ్వర్యంలో ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా అంజనేయరెడ్డి ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ధ్యానం చేయడంతో శరీరంలోని ఎలాంటి రోగాలనైనా తగ్గించి భవిష్యత్‌లో వ్యాధులు రాకుండా కాపాడుతుందన్నారు. దిన చర్యలో ధ్యానం చేయడం ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. ధ్యాన ప్రచార కర్త సత్యనారాయణతో పాటు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్‌ ప్రవేశానికి దరఖాస్తులు

కోడేరు: పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు మోడల్‌ స్కూల్‌ జూనియర్‌ కళాశాలలో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్‌ ఉమఅన్న తెలిపారు. బైపీసీలో 40 సీట్లు, ఎంపీసీలో 40, సీఈసీలో 40, ఎంఈసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఈ నెల 25వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వెల్దండ: మండల కేంద్రంలోని మోడల్‌ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్‌ మొదటి సంవత్సరంలో చేరేందుకు విద్యార్థులు ఈ నెల16 నుంచి 25వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని బుధవారం వైస్‌ప్రిన్సిపాల్‌ రాధాకృష్ణ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లో విద్యార్థులు చేరే అవకాశం ఉందన్నారు. బాలికలకు హాస్టల్‌ వసతి ఉందన్నారు.

గోశాలకు 73 దేశవాళి పశువులు

ఊర్కొండ: హైదరాబాద్‌ స్లాటర్‌ హౌస్‌కు అక్రమంగా తరలిస్తున్న 73 దేశవాళి పశువులను మండలంలోని గురునానక్‌ గోశాలకు అప్పగించారు. బుధవారం మండలంలోని ముచ్చర్లపల్లి గేటు వద్ద నుంచి పశువులను తరలిస్తున్నట్లు తెలుసుకున్న ఎస్‌ఐ నరేష్‌, పశు వైద్య అధికారి నాగరాజు వాహనాన్ని అడ్డగించారు. అనంతరం ఈ పశువులను గోశాలకు తరలించామని తెలియజేశారు.

ఎస్‌ఐ నరేష్‌కు సన్మానం



ఊర్కొండ: బదిలీపై ఎస్‌ఐగా వచ్చిన నరేష్‌ను కల్వకుర్తి జేఏసీ చైర్మన్‌ సదానందం గౌడ్‌, కానుగుల జంగయ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి డిగ్రీ కళాశాలలో పాఠాలు బోధిస్తూనే ప్రొఫెసర్‌ జయశంకర్‌, కోదండరాం స్ఫూర్తితో ఉద్యమాన్ని నడిపించామన్నారు. శాంతిభద్రతలను పరిరక్షిస్తూ అందరికీ తగు న్యాయం జరిగేలా కృషి చేస్తామని చెప్పారు.

బాధితుడికి సీఎం సహాయనిధి



ఊర్కొండ: మండలంలోని మాదారానికి చెందిన బాలరాజు అనారోగ్యంతో బాధపడుతున్నాడు. చికిత్స అనంతరం సీఎం రిలీఫ్‌ ఫండ్‌కు అర్జీ పెట్టుకోగా.. ఆయనకు ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి సహకారంతో మంజూరైన రూ.60 వేల చెక్కును వైస్‌ ఎంపీపీ అరుణ్‌రెడ్డి బుధవారం అందజేశారు.

కూలీలందరికీ పని కల్పించాలి



వెల్దండ: మండల పరిధిలోని పోషమ్మగడ్డతండాలో బుధవారం ఎంపీడీఓ శ్రీనివాసులు జాతీయ ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కూలీలు కొలతల ప్రకారం పనులు చేస్తేనే గిట్టుబాటు కూలి డబ్బులు వస్తాయన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉందని, కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం గ్రామపంచాయతీలో రికార్డులను పరిశీలించారు. ఈసీ దేవేందర్‌, కార్యదర్శి సురేందర్‌ రెడ్డి, పంతునాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌ క్లబ్‌ పీఆర్‌ఓగా పాష

కల్వకుర్తి రూరల్‌: లయన్స్‌ క్లబ్‌ ఆఫ్‌ ఆమనగల్‌ పీఆర్‌ఓగా పాష 15వ సారి ఎంపికయ్యారు. 2008 సంవత్సరంలో మొదటి సారి బాధ్యతలు తీసుకుని లయన్స్‌ క్లబ్‌ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవలను, కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేసి గుర్తింపు పొందాడు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



కొల్లాపూర్‌లో క్రీడల ప్రారంభోత్సవంలో అధికారులు, నాయకులు

కొల్లాపూర్‌: క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని కొల్లాపూర్‌ ఆర్డీఓ హనుమనాయక్‌ అన్నారు. బుధవారం కొల్లాపూర్‌లోని మినీ స్టేడియంలో ఎంపీడీఓ కార్యాలయం ఆధ్వర్యంలో సీఎం కప్‌–2023 మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్‌, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్‌ పోటీల్లో పాల్గొన్నారు. క్రీడల్లో గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు పంపుతామని ఎంపీడీఓ చెన్నమ్మ తెలియజేశారు. క్రీడాకారులను ఉద్దేశించి ఆర్డీఓ, ఎంపీడీఓలు మాట్లాడారు. తహసీల్దార్‌ శివ శ్రీనివాస్‌, కిషన్‌నాయక్‌, నరేందర్‌రెడ్డి, కృష్ణయ్య, రాజయ్య పాల్గొన్నారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో సీఎం కప్‌ పోటీలను తిలకించేందుకు నాగర్‌కర్నూల్‌ డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. చదువుతో పాటు క్రీడలు మానసికోల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. గెలుపొందిన వారికి ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌ రెడ్డి చేతులమీదుగా బహుమతి అందజేశారు. ఎంపీడీఓ శ్రావణ్‌ కుమార్‌, సత్యనారాయణ యాదవ్‌ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

పెద్దకొత్తపల్లి: క్రీడాకారులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్‌ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఎం కప్‌ పోటీలను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని ఈ సందర్భంగా మాట్లాడారు. చంద్రయ్య, తహసీల్దార్‌ శ్రీనివాసులు, ఎంపీడీఓ కృష్ణయ్య, శశికళ, శివశంకర్‌ పాల్గొన్నారు.

వాలీబాల్‌, కబడ్డీలో జిల్లా స్థాయికి ఎంపిక

దోమలపెంట: జిల్లా యవజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్‌లో మంగళవారం నిర్వహించిన వాలీబాల్‌, కబడ్డీ పోటీల్లో దోమలపెంట జట్టు విజేతగా నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైంది. 22 నుంచి నాగర్‌కర్నూల్‌లో నిర్వహించే జిల్లా స్థాయి పోటీలకు తమ జట్టు ఆటగాళ్లు సిద్ధమవుతున్నట్లు తెలియజేశారు.

ప్రోత్సహించేందుకే పోటీలు

లింగాల: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ఇలాంటి పోటీలు దోహదపడుతాయని ఎంపీపీ లింగమ్మ, సర్పంచ్‌ కోనేటి తిర్పతయ్య అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల మైదానంలో బుధవారం మండల స్థాయి పోటీలు ప్రారంభించారు. ప్రతిభ కనబర్చిన వారిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, తహసీల్దార్‌ మునిరాథ్దీన్‌, హెచ్‌ఎం శేఖర్‌ పాల్గొన్నారు.

మండల స్థాయిలో ఆటల పోటీలు

ఉప్పునుంతల: మండలంలోని ఆయా గ్రామాల నుంచి వచ్చిన క్రీడాకారులతో వాలీబాల్‌, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్‌ పోటీలను నిర్వహించి విజేతలైన టీంలను ఈ నెల 22న జిల్లా స్థాయిలో నిర్వహించే ఆటల పోటీలకు ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు తెలియజేశారు.

ముగిసిన క్రీడలు

తాడూరు: మండల కేంద్రంలో సీఎం కప్‌ క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌, అథ్లెటిక్స్‌ పోటీలు మహిళలకు, పురుషులకు నిర్వహించారు. 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఖోఖో మహిళా విభాగంలో 15 మంది, పురుషుల విభాగంలో 15 మందిని అదే విధంగా అథ్లెటిక్స్‌ 100 మీటర్ల పరుగు పందెంలో మహిళలు, పురుషుల నుంచి ఒక్కొక్కరు, 400 మీటర్ల విభాగంలో ఒక్కొక్కరిని, డిస్కస్‌ త్రో విభాగంలో పురుషులు, మహిళలో ఒక్కొక్కరిని జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశామని స్పోర్ట్స్‌ కమిటీ కన్వీనర్‌ గంగమోహన్‌ తెలియజేశారు.

తెలకపల్లి: క్రీడలు ఆరోగ్యాన్ని, మానసికోల్లాసాన్ని ఇస్తాయని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ ప్రారంభించారు. సీఎం కప్‌ టోర్నీలో భాగంగా ఉన్నత పాఠశాల ఆవరణలో అన్ని గ్రామపంచాయతీల నుంచి వచ్చిన క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో పాల్గొంటారని చెప్పారు. ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్‌, ఎంపీడీఓ భాస్కర్‌, ఎంఈఓ చంద్రుడు, గ్రామపంచాయితీ కార్యదర్శి భాస్కర్‌, పీఈటీలు శ్రీనివాస్‌ పాల్గొన్నారు.



తాడూరులో..



అమ్రాబాద్‌లో..



తెలకపల్లిలో ఎంపీపీ కొమ్ము మధు



పెద్దకొత్తపల్లిలో..



లింగాలలో సర్టిఫికెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

పంటను కొనుగోలు చేయడంలో విఫలం



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు కె కుమార్‌

నాగర్‌కర్నూల్‌ రూరల్‌: యాసంగి సీజన్‌లో రైతులు కష్టించి పండించిన వరి, మొక్కజొన్న ధాన్యాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనుగోలు చేయడంలో తీవ్రంగా విఫలమవుతున్నాయని బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్‌ కె.కుమార్‌ ఆరోపించారు. బహిరంగ మార్కెట్‌లోని ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంలో ఎందుకు విఫలం చెందుతున్నాయో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. బుధవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అకాల వర్షాలతో రైతులు ధాన్యాన్ని ఎంతో జాగ్రత్తగా బహిరంగ మార్కెట్‌కు తీసుకోస్తే అటు ప్రభుత్వం, ఇటు మిల్లర్లు ధాన్యాన్ని కొనక దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఎస్పీ జిల్లా అసెంబ్లీ అధ్యక్షుడు కారంగి బ్రహ్మయ్య, అచ్చంపేట, నాగర్‌కర్నూల్‌ అసెంబ్లీ అధ్యక్షుడు మోతుకూరి నాగర్జున, పృథ్వీరాజ్‌, నాయకులు కళ్యాణ్‌, రాజు, రాజశేఖర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌డీఎం పార్లమెంట్‌ కోఆర్డినేటర్‌గా మధుసూదన్‌



కందనూలు: లీడర్‌షిప్‌ డెవలప్‌మెంట్‌ మిషన్‌ (ఎల్‌డీఎం) కాంగ్రెస్‌ పార్టీ పార్లమెంట్‌ కోఆర్డినేటర్‌గా ఊర్కొండకి చెందిన అలుగొండ మధుసూదన్‌ రెడ్డిని నియమిస్తూ.. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ పార్లమెంట్‌ నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ పార్టీ బలోపేతం, పార్టీ సంస్థాగత నిర్మాణం, రిజర్వు నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి ఏఐసీసీ సమన్వయకర్తలను నియమించింది. అందులో భాగంగా నాగర్‌కర్నూల్‌ ఎస్సీ పార్లమెంట్‌ స్థానానికి ఊర్కొండ మండల కేంద్రానికి చెందిన అలుగొండ మధుసూదన్‌ రెడ్డి సమన్వయకర్తగా ఏఐసీసీ నియమించింది. ఈ సందర్భంగా మధుసూదన్‌ రెడ్డి మాట్లాడారు. నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ పరిధిలోని ఉన్నటువంటి ఎస్సీ, ఎస్టీలను అసెంబ్లీ స్థానంతో పాటుగా నాగర్‌కర్నూల్‌ పార్లమెంట్‌ స్థానంలో కాంగ్రెస్‌ పార్టీ గెలుపొందడానికి అవసరమైన కార్యక్రమాలు రూపొందిస్తానని అన్నారు.

ఘనంగా అయ్యప్ప ప్రథమ వార్షికోత్సవ పూజలు



పూజలు నిర్వహిస్తున్న వేద బ్రాహ్మణులు

తాడూరు: మండల కేంద్రంలో కొమ్ముగుట్ట ప్రాంతంలో నిర్మించిన అయ్యప్ప దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవ మహోత్సవ పూజలు ఘనంగా నిర్వహించారు. పుచ్చ అనురూప్‌ శర్మ ఆధ్వర్యంలో బుధవారం హోమం, అయ్యప్ప పడిపూజ, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి యంత్ర ప్రతిష్ఠ, ప్రాతః కాల పూజలు, శివాంజనేయ అయ్యప్ప స్వామి దేవతా 108 అష్టోత్తర కలశ పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

శిథిలావస్థకు చేరిన జటప్రోల్‌ బ్రిడ్జి



జటప్రోల్‌ బ్రిడ్జ్‌ ఇలా..

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్‌ గ్రామ సమీపంలో కొల్లాపూర్‌, పెబ్బేరు, కర్నూల్‌ వెళ్లే ప్రధాన రహదారిలో బ్రిడ్జి ఉంటుంది. గతంలో శ్రీశైలం ప్రాజెక్ట్‌ కట్టినప్పుడు కృష్ణానది నీరు ఎగువకు జటప్రోల్‌ గ్రామ సమీపం వద్దకు వచ్చాయి. అప్పట్లో రాకపోకలకు ఇబ్బందులు అవుతాయని 1983లో దాదాపు 190 మీటర్ల పొడవుతో వంతెనను నిర్మించారు. అది అప్పటి నుంచి ఇప్పటి వరకు దాదాపు నాలుగు శతాబ్దాలు గడుస్తుండటంతో ఇప్పుడు ఆ బ్రిడ్జ్‌ పూర్తిగా శిథిలావస్థకు చేరింది. దాంతో ప్రజలు, ప్రయాణికులు భయాందోళనతో బ్రిడ్జిపై ప్రయాణిస్తుంటారు. ఈ బ్రిడ్జి కింద నిండు కుండలా ఆరు నెలలపాటు కృష్ణానది ప్రవహిస్తుంటుంది. ఆ బ్రిడ్జికు ఇరువైపుల ఉన్న రక్షణ గోడలు కూడా పూర్తిగా పాడై అక్కడక్కడ పగిలిపోయాయి. నిత్యం కొల్లాపూర్‌, కర్నూల్‌కు వెళ్లే వాహనాలు వందలాదిగా ఈ బ్రిడ్జిపై తిరుగుతూనే ఉంటాయి. ఎప్పుడు ఏమవుతుందో అని చుట్టు పక్కల గ్రామ ప్రజలు, ప్రయాణికులు నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు కోరినా ఫలితం లేకుండాపోయింది. రోజురోజుకు ఆ బ్రిడ్జి స్థితిగతులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వంతెపై సైడ్‌కు ఉన్న రక్షణ గోడలు కాని, వంతెన పైన కాని ఇనుప చువ్వలు తేలి కనిపిస్తుంటాయి. నిత్యం ఎంతో మంది మండల కేంద్రం పెంట్లవెల్లి మరియు కొల్లాపూర్‌కు పలు కార్యక్రమాల కోసం ప్రజలు నిత్యం ప్రయాణిస్తుంటారు. దాంతో ఎప్పుడు ఏమవుతుందోనని భయంతోనే స్థానిక ప్రజలు ఎప్పుడు కొట్టుమిట్టాడుతుంటారు. ఇప్పటికైనా స్థానిక ప్రజాప్రతినిధులు, ఆర్‌అండ్‌బీ అధికారులు ప్రత్యేక దృష్టిసారించి నూతన బ్రిడ్జి నిర్మాణం కోసం కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జిపై ప్రయాణిస్తున్న వాహనాలు

నూతన నిర్మాణం చేపట్టాలి



కృష్ణానదిపై వేసిన బ్రిడ్జ్‌ ఇప్పుడు పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో బ్రిడ్జ్‌పై ప్రయాణం చేయాలంటే ఇబ్బందులకు గురవుతున్నాం. ఎలాగైనా ప్రజాప్రతినిధులు బ్రిడ్జ్‌పై ప్రత్యేక దృష్టి సారించి నూతన బ్రిడ్జ్‌ నిర్మాణం చేపట్టాలి.

– గోపాల్‌ జటప్రోల్‌

ప్రతిపాదనలు పంపించాం..

జటప్రోల్‌లోని ఈ బ్రిడ్జ్‌ నిర్మాణం కోసం మరమ్మతు చేపట్టాలని, గతంలోనే రూ.60 లక్షల ప్రపోజల్‌ పెట్టి పంపించాం.. కాని ఇంకా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. మళ్లీ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం.

– రవి, ఆర్‌అండ్‌బీ ఏఈ

భక్తిభావంతో మెలగాలి



పూజలు చేస్తున్న సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తి రూరల్‌: సమాజంలోని ప్రతిఒక్కరూ భక్తి భావంతో మెలగాలని ఐక్యతా ఫౌండేషన్‌ చైర్మన్‌ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి కోరారు. బుధవారం మండలంలోని కురుమిద్దె శ్రీలక్ష్మీనరసింహ స్వామి విగ్రహప్రతిష్ఠాపనలో పాల్గొన్నారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోని భీమేశ్వర శివాలయంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రాఘువేందర్‌రెడ్డిని సన్మానించారు. మున్సిపల్‌ చైర్మన్‌ ఎడ్మ సత్యం, శ్రీశైలం, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కల్వకుర్తి: పట్టణంలోని భీమేశ్వర శివాలయ ప్రాంగణంలో ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా కొనసాగుతున్నాయి. బుధవారం ధ్వజస్తంభం, నవగ్రహ విగ్రహప్రతిష్ఠాపనలో ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌, జాతీయ బీసీ కమిషన్‌ మాజీ సభ్యులు ఆచారీ, మున్సిపల్‌ చైర్మన్‌ ఎడ్మసత్యం దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ చైర్మన్‌ శ్రీశైలం, గ్రామాల సర్పంచ్‌లు, కౌన్సిలర్లు ఉత్సవాల్లో పాల్గొన్నారు.

కల్వకుర్తి మండలంలోని కురుమిద్దెలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం, నవగ్రహ గణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవాలు బుధవారం ముగిశాయి. మూడు రోజుల పాటు హోమాలు నిర్వహించారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి



కురుమిద్దెలో పాల్గొన్న భక్తులు

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

తెలకపల్లి: ఐకేపీలో పనిచేస్తున్న వీఓఏలు చేస్తున్న నిరవధిక సమ్మె బుధవారానికి 31 రోజుకు చేరింది. ఈ సందర్భంగా మాట్లాడారు. తమ సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరవధిక సమ్మెపై ప్రభుత్వం ఏ మాత్రం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరారు.

వరి కొనుగోలు కేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సోమనాథ్‌

కోడేరు: మండలంలోని నార్యనాయక్‌తండాలో కొల్లాపూర్‌ వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌చైర్మన్‌ సోమనాథ్‌, నర్సాయిపల్లి సింగిల్‌విండో చైర్మన్‌ కృష్ణరెడ్డి బుధవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు మధ్యదళారులను ఆశ్రయించి మోసపోవద్దన్నారు. సింగల్‌విండో డైరెక్టర్‌ లక్ష్మణ్‌నాయక్‌, భాస్కర్‌నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపైనే స్తంభాలు.. ప్రమాదానికి సంకేతాలు

ఉప్పునుంతల: మండలంలోని తాడూరు–ఉప్పునుంతల బీటీ రోడ్డు మార్గంలో విద్యుత్‌ స్తంభాలను నిర్లక్ష్యంగా రోడ్డుపైనే ఇరువైపుల ప్రమాదభరితంగా పాతడంతో వాహనదారులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడూరు శివారులో ఏర్పాటు చేసిన విద్యుత్‌ సబ్‌స్టేషన్‌ వరకు రెండు విద్యుత్‌ లైన్ల కోసం సంబంధిత కాంట్రాక్టర్‌ తాడూరు నుంచి దాదాపుగా కిలోమీటరు దూరం బీటీ రోడ్డుకు రెండు వైపుల స్తంభాలను పాతారు. రోడ్డుకు అంచు వెంట నాటడానికి ఎలాంటి ఇబ్బంది లేకున్నా కాంట్రాక్టర్‌ నిర్లక్ష్యంతో రోడ్డుపైనే నాటించారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దాంతో రెండు ఎదురెదురు వాహనాలు రోడ్డుపై అటుఇటూ సైడ్‌కు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రివేళ ఈ స్తంభాలతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశాలు మెండుగా ఉండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సబ్‌స్టేషన్‌ ప్రారంభోత్సవానికి హాజరైన స్థానిక ఎమ్మెల్యే గువ్వల బాలరాజుకు రైతులు, గ్రామస్తులు వినతి అందజేశారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపులా ప్రమాదభరితంగా వేసిన విద్యుత్‌ స్తంభాలను తీయించాలని అక్కడున్న సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించినా తర్వాత వారు పట్టించుకోకుండా వదిలేశారు.



జానపద కళాకారుడి మృతికి సంతాపం

తాడూరు: మండలంలోని బలాన్‌పల్లికి చెందిన ప్రముఖ జానపద కళాకారుడు వెల్దాల నాగయ్య(42) అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. గ్రామానికి చెందిన నాగయ్య, బుడాయిల బుచ్చిగాడు, తుపాకి రాముడు వంటి హాస్య ప్రదర్శనలతో పాటు అన్నసైన్యం సినిమాకు పాటలు రాశాడన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ వివిధ పాటలు పాడారని, ఆయన మృతి తీరని లోటన్నారు.

పెళ్లికి ఆర్థిక సాయం

ఊర్కొండ: మండలంలోని జకినాలపల్లికి చెందిన బొల్లు కలమ్మ కృష్ణయ్య కుమార్తె అశ్విని వివాహానికి సర్పంచ్‌ అనిల్‌ రెడ్డి బుధవారం రూ.15 వేల ఆర్థిక సాయం అందజేశారు.

లింగాల: మండల పరిధిలోని చెన్నంపల్లికి చెందిన మూడావత్‌ పర్వతాలు మంగళవారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మండల యువజన కాంగ్రెస్‌ అధ్యక్షుడు శ్రీనివాస్‌రాథోడ్‌ మరికొందరు మృతుని కుటుంబాన్ని పరామర్శించి రూ.3 వేల ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యం అందజేశారు.

జకినాలపల్లిలో కంటివెలుగు



ఊర్కొండ: మండలంలోని జకినాలపల్లిలో బుధవారం కంటివెలుగు కేంద్రాన్ని సర్పంచ్‌ అనిల్‌ రెడ్డి ప్రారంభించారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులను కోరారు. కార్యక్రమంలో భాస్కర్‌, బంగారమ్మ శంకర్‌, కరుణాకర్‌ రెడ్డి, ఐదమయ్య పాల్గొన్నారు.

సీఐకి సన్మానం



కల్వకుర్తి రూరల్‌: నూతన కల్వకుర్తి సర్కిల్‌ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న పార్థసారథిని బుధవారం యువజన కాంగ్రెస్‌ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్‌గౌడ్‌ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించి మొక్కను అందజేశారు. జంగయ్య గౌడ్‌, రమేష్‌, రవి, అనిల్‌కుమార్‌, మాలిక్‌ తదితరులు పాల్గొన్నారు.

19న అవగాహన

వెల్దండ: మండల కేంద్రంలోని ఏపీఆర్‌ గార్డెన్‌లో ఈ నెల 19న గొర్రెల పంపిణీ రెండో విడతపై అవగాహన కల్పించనున్నట్లు పశు వైద్య అధికారి శ్యామ్‌సుందర్‌ బుధవారం తెలియజేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ హాజరవుతారని వివరించారు.

కోటి ఆశలతో సాగుకు సన్నద్ధం



ఎమిరెడ్డిపల్లిలో దుక్కి దున్నుతున్న రైతు



వడ్రంగితో నాగలి సరిచేయించుకుంటున్న రైతులు

అమ్రాబాద్‌: వర్షాభావ పరిస్థితులతో సరిపడా పంటల దిగుబడి లేక నిరాశతో ఉన్న రైతులకు ఈ ఏడు ముందస్తుగా ప్రస్తుతం కురిసిన వర్షాలకు అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. అదే సంతోషంతో రైతులు కోటి ఆశలతో వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్నారు. అమ్రాబాద్‌ ఉమ్మడి మండల వ్యాప్తంగా(పదర, అమ్రాబాద్‌)లో రూ.25 వేల ఎకరాల సాగుభూమి ఉంది. వాస్తవంగా ఉగాది నుంచి వానాకాలం కోసం రైతులు వ్యవసాయ పనులు చేపట్టాల్సి ఉండగా.. నిరాశతో ఉన్న రైతులు పనులు చేపట్టలేదు. అయితే వారం రోజుల కిందట మండలంలో పలు గ్రామాల్లో వర్షాలు కురిశాయి. ఇదే అదునుగా భావించి రైతులు పూర్తిగా వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. కొంత మంది రైతులు దుక్కులు దున్నుతుండగా.. మరి కొంత మంది రైతులు వ్యవసాయ పొలాల్లో చెత్త తీయడం, వలికుప్పలు కాల్చడం, వంటి పనుల్లో నిమగ్నమయ్యారు. వర్షం రాకతో వడ్రంగులు వాకిళ్లు కూడా రైతుల తాకిడితో సందడిగా మారాయి. నాగలి, విత్తనాలు వేసేందుకు గుంటుకలు, తయారు చేయించుకుంటున్నారు. పోగు చేసుకున్న ఎరువులను పొలాలకు తరలించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ సారైన దేవుడు కరుణించి మంచి పంటలు పండాలని రైతులు ఎంతో ఆశతో, ఆనందంతో సాగుకు సిద్ధమవుతున్నారు. దీనికి తోడు ప్రభుత్వం ముందస్తుగా రైతులకు రైతుబంధు పథకంతో పెట్టుబడి సాయంతో రైతుల్లో మరింత ఉత్సాహం నెలకొంది.

మన్నును నమ్ముకునే బతకాలి



ఈ ప్రాంతంలో సాగునీరు లేదు. వానదేవుడు, భూతల్లిని నమ్ముకునే బతకాలి. ఏటా సరిగా వానలు లేక, గత వానాకాలం వర్షాలు అధికమై పంటలు అంతంత మాత్రంగానే పండాయి. ఈ వానలకు మొత్తం పొలాలు సిద్ధం చేస్తున్నాం. ఈ సారైనా అధిక దిగుబడి వస్తే బాగుండు.

– కృష్ణయ్య, రైతు, అమ్రాబాద్‌